క్లుప్తంగా

నేడు యోగా శిక్షణ తరగతులు

కలికిరి: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మొహమ్మద్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్‌లు, ఐకేపీ సిబ్బందికి, 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరక అంగన్వాడీ టీచర్‌లు, ఆయాలకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు గ్రామ సచివాలయాల సిబ్బందికి మాస్టర్ ట్రైనర్‌లతో యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బంది తప్పనిసరిగా హాజరవ్వాలని ఆయన కోరారు.

నేటి నుంచి మహబూబ్ సుబహాని ఉరుసు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం జెండామాను వద్ద హజరత్ మహబూబ్ సుబహాని 79వ ఉరుసు ఉత్సవం మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు ఉత్సవం జరుగుతుందని చెప్పారు. మంగళవారం, బుధవారం రాత్రి ఖవ్వాలీ, పాటల కచ్చేరి ఉంటుందని తెలిపారు. హిందూ ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహిత



పీలేరు : వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పీలేరుకు చెందిన మహితను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పీలేరు ఎంపీపీగా పని చేసిన ఆమె వైఎస్సార్ సీపీలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ పదవుల్లో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఆమె సేవలను గుర్తించి మహిళావిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు పదవి ఇవ్వడానికి సహకరించిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాసశివరాత్రి పురస్కరించుకుని అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రమణ, సిబ్బంది అంకన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం



నూతన కార్యవర్గంతో ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె: ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికైనట్టు ఆ సంఘ నాయకులు ఆదివారం తెలిపారు. అధ్యక్షుడుగా ఎస్.మస్తాన్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా వాసు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, ఇంద్రాణి, సాంబశివ నాయక్, నరసింహులు, కార్యదర్శిగా చలపతినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా దేవా, ప్రచార కార్యదర్శులుగా శ్రీనివాసులు రెడ్డి, నరసింహులు, సహాయ కార్యదర్శులుగా జానకి, రాధా, కే.కృష్ణప్ప, కోశాధికారులుగా చంద్ర, శంకర్, గౌరవాధ్యక్షులుగా టి.కృష్ణప్ప, గౌరవ సలహదారుగా మురళీ, సాంబశివను ఎన్నుకున్నట్టు తెలిపారు.

ప్రతిభా పురస్కారాలు

సుండుపల్లె : 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఆదివారం మానవత సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. నెలవారీ సమావేశంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సుండుపల్లె కెనరా బ్యాంకు మేనేజర్ మస్తాన్ పాల్గొని విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రాబోయే నెలలో చేయాల్సిన కార్యక్రమాల గురించి సంస్థ సభ్యులు చర్చించుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణంరాజు, డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి, కార్యదర్శి హరికుమార్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

చింతతో ఆరోగ్యానికి నిశ్చింత

- చింత చిగురులో సీ విటమిన్
- జోరుగా అమ్మకాలు
- మార్కెట్‌లో కిలో రూ.500



మార్కెట్‌లో విక్రయిస్తున్న చింతచిగురు

మదనపల్లె సిటీ: మదనపల్లె డివిజన్‌లో చింతచెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఆకురాలిన చింత చెట్లు ప్రస్తుతం చిగురించాయి. ఈ సీజన్ వస్తే ఈ ప్రాంతంలో పలువురు ఇళ్లలో చింతచిగురు చారును లొట్టలేసుకుని తింటుంటారు. దీంతో లేత చిగురు కోసం చింత చెట్ల వద్ద జనం కనిపిస్తున్నారు. చింత చెట్లకు ఎటువంటి క్రిమిసంహారకమందులు లాంటివి వాడరు. దానికి తోడు చింత చిగురులో సీ విటమిన్ పుష్కలంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పూర్వీకుల కాలం నుంచి ఈ ప్రాంతాల్లో చింత చిగురుకు భలే క్రేజ్ ఉంది. చిగురుతో లేత వంకాయలేసి చారు కాచి దానిని రాగి సంగటితో వడ్డిస్తే అబ్బో ఊహిస్తేనే నోట్లో నీళ్లురుతాయి. కొందరు చింతచిగురు ఎండపెట్టి పౌడర్‌గా తయారు చేసుకుని వేపుళ్లల్లో వాడుతారు. చింత చిగురు సీజన్ ఇక నెల రోజులు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత చెట్లలోని చిగురు ముదిరిపోతుంది. అందుకే ఈ సీజన్‌లో దొరికే చిగురు కోసం ఈ ప్రాంత వాసులు అంత ఆసక్తి చూపుతారు.

కాసులు కురిపిస్తున్న చింతచిగురు

చింతే కదా అని తీసిపారేయకండి. మదనపల్లె మార్కెట్‌లో కిలో ధర ఏకంగా రూ.500 పలుకుతోంది. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో చెట్ల నుంచి చిగురును సేకరించి మదనపల్లె మున్సిపల్ కార్యాలయం, బెంగళూరు బస్టాండు, నీరుగట్టువారిపల్లె ప్రాంతాల్లో చింతచిగురు అమ్ముతున్నారు. కొందరు ఉదయం బుట్టలో పెట్టుకుని వీధుల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. దీనికి మంచి డిమాండ్ ఉండటంతో పలువురు కొనుగోలు చేస్తున్నారు.

సీ విటమిన్ పుష్కలం



చింత చిగురులో ఎక్కువగా సీ విటమిన్ ఉంటుంది. ఇది మనిషిలో నష్టపోయిన కణజాలాన్ని సరి చేస్తుంది. శరీరంలో కొల్లాజెన్ నిర్మాణం, ఐరన్ సంగ్రహణ, దెబ్బలు, గాయాలను మాన్పడం చేస్తుంది. ముఖ్యంగా ఎముకలు, దంతాలు గట్టిగా ఉండేలా చేస్తుంది. శరీరంలో యాంటి యాక్సిడెంట్లను బాగా అందిస్తుంది.

-డాక్టర్ వెంకటరామయ్య, ప్రభుత్వ వైద్యులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

బాస్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతికి ఘన సన్మానం



గణపతి దంపతులను సత్కరిస్తున్న గొల్లహళ్లి శివప్రసాద్, పీటీయం శివప్రసాద్ తదితరులు

మదనపల్లె రూరల్ : భారతీయ అంబేడ్కర్ సేన చేపట్టిన సంఘ సంస్కరణ ఉద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అంబేడ్కర్ ఆశయాల సాధనకు శక్తివంచన లేకుండా కృషిచేయాలని కర్ణాటక ప్రభుత్వ జానపద అకాడమీ చైర్మన్ గొల్లహళ్లి శివప్రసాద్ అన్నారు. ఆదివారం ఆదివారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన ఉలగనాథన్ గణపతికి ఘనంగా సన్మానం జరిగింది. కార్యక్రమానికి గొల్లహళ్లి శివప్రసాద్, బాస్ వ్యవస్థాపకులు పీటీయం శివప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా బాస్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతితో పాటు రాయలసీమ జిల్లాల నుంచి రాష్ట్ర కమిటీకి ఎన్నికైన ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గొల్లహళ్లి శివప్రసాద్ మాట్లాడుతూ....కారంచేడులో దళితులపై నరమేధం జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఉధృతంగా సాగిన దళిత ఉద్యమానికి, కర్ణాటకలోని దళిత సంఘర్షణ సమితి అండగా నిలిచిందని గుర్తుచేశారు. కుల ఉద్యమాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో బలహీనపడిన దళిత ఉద్యమాన్ని తిరిగి బలోపేతం చేసేందుకు భారతీయ అంబేడ్కర్ సేన చేపట్టిన సైద్ధాంతిక ఉద్యమం, ఎంతో గొప్ప లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. బాస్ పోరాటాలకు కర్ణాటక దళిత సంఘర్షణ సమితి ఎల్లవేళలా అండగా నిలుస్తుందన్నారు. బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ...సమగ్ర సామాజిక విప్లవం కోసం, విశాల ప్రజాసమూహాలను ఐక్యం చేస్తూ, భారతీయ అంబేడ్కర్ సేన చేపట్టిన సంఘ సంస్కరణ ఉద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సన్మానం అందుకున్న వారిలో స్టేట్‌ప్రెసిడెంట్ గణపతి, రాధ దంపతులతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి స్టేట్ కమిటీకి ఎన్నికైన ప్రతినిధులు... పాలకుంటశ్రీనివాసులు (పీలేరు), పల్లంతాతయ్య (రాయచోటి), నీరుగట్టిరమణ, టి.ఏ.పీర్‌బాషా (మదనపల్లె), ముత్యాలమోహన్ (తంబళ్లపల్లె), మల్లెమొగ్గల ఉమాపతి(తిరుపతి), రమణయ్య(కడప), మద్దిలేటి ప్రమీల(నంద్యాల), జన్నే ఆనంద్(అనంతపురం), వి.దొరస్వామి(చిత్తూరు), బాలకృష్ణ(కుప్పం), మహేష్(కర్నూల్), విజయ్‌కుమార్(పూతలపట్టు), నరసింహ(జమ్మలమడుగు), వాసు(చంద్రగిరి) తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధులు పోతబోలురెడ్డెప్ప, బురుజు లక్ష్మీనారాయణ, కే.వీ.రమణ, చాట్లబయన్న, సొన్నికంటిరెడ్డెప్ప, జి.వి.రమణ, వై.గంగాధర్, శశికుమార్, రాయల్‌సూరి, బురుజురెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులే లక్ష్యంగా కూటమి పాలన

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజవకర్గ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే మీడియా, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులతోనే భయానక వాతావరణాన్ని సృష్టిస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ఏడాది పాలన సాగిందని విమర్శించారు.

గ్రామ స్థాయిలో పార్టీ గ్రామ కమిటీల నియామకానికి నాయకులు చొరవ చూపి త్వరితగతిన నియామకాలు పూర్తికి సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజా నమ్మం పూర్తిగా కోల్పోయిందన్నారు. వచ్చే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి ఏకపక్ష విజయం తథ్యమన్నారు. నియోజవర్గంలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలు ప్రత్యేక దృష్టిసారించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి జూన్ 4కు ఏడాది పూర్తవుతుందన్నారు. జూన్ 4న ప్రజలకు వెన్నుపోటు దినంగా ప్రకటించి, ప్రజలకిచ్చిన హామీలపై జిల్లా కేంద్రం రాయచోటిలో జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. ఇందుకు ప్రతి గ్రామం, మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, వాల్మీకిపురం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, కలికిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్‌రెడ్డి, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ మండల పార్టీ కన్వీనర్‌లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, పులి శివరకుమార్‌రెడ్డి, ముక్తియార్ అహ్మద్, కమలాకర్ రెడ్డి, నాయకులు రామ్ ప్రసాద్ నాయుడు, నీళ్ళ భాస్కర్, బిడ్డల కేశవరెడ్డి, అబ్దుల్ కలీం, అప్పల్లా, నక్కా శేఖర్, కోర్దు సుబ్బారెడ్డి, జయమరామచంద్రయ్య, స్టాంపుల మస్తాన్, ఎస్టీడి హరి, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె రైతులకు 500 క్వింటాళ్ల వేరుశనగ ఉచితం

మదనపల్లె: మదనపల్లె డివిజన్‌లోని ఖరీఫ్ వేరుశెనగ రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా 500 క్వింటాళ్ల వేరుశెనగ విత్తన కాయలను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టింది. గత జనవరి 8న కేంద్ర కరువు బృందం మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో పర్యటించి కరువు పరిస్థితులను కళ్లారా చూసింది. దీనిపై కేంద్రం నుంచి రైతాంగానికి ఆర్థికపరమైన వెసులుబాటు కల్పించకపోయినప్పటికి నేషనల్ ఆయిల్ సీడ్ మిషన్ పథకం కింద విత్తన కాయలను ఉచితంగా అందించాలని నిర్ణయించి ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మదనపల్లె డివిజన్‌లోని 8 మండలాలకు చెందిన రైతులకు వెయ్యి టన్నుల వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ ఏపీ సీడ్స్ అధికారులకు లేఖ రాశారు. ఈ పరిమాణంలో విత్తన కాయలు సరఫరా చేయాలని కోరగా అందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటి సరఫరా అయ్యాక వెయ్యి ఎకరాల్లో పంట సాగు చేసేలా రైతులకు పంపిణీ చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మహల్ జెడ్పీ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కలికిరి: మండలంలోని మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో 2003–04 విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చదువుకున్నప్పటికి విశేషాలను గుర్తు చేసుకున్నారు. సుమారు 20ఏళ్ల తరువాత విద్యార్థులు కలవడంతో పాఠశాల ఆవరణంలో సందడి నెలకొంది. అప్పటి గురువులను సన్మానించి గౌరవించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ పడాలని పూర్వపు విద్యార్థుల తీర్మాణించుకున్నారు.

29 మందికి కంటి ఆపరేషన్‌లు

రాయచోటి జగదాంబ సెంటర్ : రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్యశిబిరంలో 29 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించినట్లు ఆసుపత్రి చైర్మన్ స్వరూప్ గుప్తా తెలిపారు. రాయచోటి నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల నుండి వచ్చిన 60 మంది కంటి రోగులకు వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తమాలిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రజాసేవతో మంచిపేరు తెచ్చుకోవాలి



ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న యువతతో నిసార్‌అహ్మద్, మనూజారెడ్డి తదితరులు

ప్రభుత్వ ఆస్పత్రిలో అభిమానుల రక్తదానం, పండ్లు పంపిణీ

మదనపల్లె రూరల్ : ప్రజాసేవతో మంచిపేరు తెచ్చుకోవాలని యువజనవిభాగం కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి సూచించారు. ఆదివారం హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో హర్ష అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన రక్తదానం, రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. భగవంతుడి ఆశీస్సులతో హర్షవర్ధన్‌రెడ్డి ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతంలో హర్షవర్ధన్‌రెడ్డి కృషి ఎనలేనిదన్నారు. రాజకీయాల్లో యువనాయకత్వం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సింధలూరి రజని, నరిబాబాయ్, ఈశ్వర్ నాయక్, సర్పంచ్ శరత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శారదారెడ్డి, అపర్ణ, మునిశేఖర్, నరసింహులు, నాగమణి, యూనస్, సాదిక్, శ్యామల, అబ్దుల్, యాసిన్, హర్ష అభిమానులు అశోక్‌రాయల్, పి.లోకేష్‌రాయల్, కోనేటి దివాకర్, ఇర్ఫాన్, తులసిగౌడ్, లోకేష్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఎంపీ స్వగృహంలో ఎంపీ మిథున్ రెడ్డితో మాట్లాడుతున్న హరీష్ రెడ్డి, తదితరులు

కలికిరి(వాల్మీకిపురం): క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి రాష్ట్ర ఏపీఎండీసీ మాజీ డైరెక్టర్ సి.హరీష్ రెడ్డికి సూచించారు. తిరుపతిలోని ఎంపీ స్వగృహంలో ఆదివారం హరీష్ రెడ్డి ఎంపీని మర్యాద పూర్వకంగా కలిశారు. పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, నాయకులు, కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉండాలని ఎంపీ . వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రధర్, పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు హరీష్ రెడ్డి వెంట పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి

కురబలకోట: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల నిర్వహణ మోయలేని భారంగా మారిందని ఏపీ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోషియేషన్ (ఏపీపీఈసీఎంఏ) (అపెక్మా) రాష్ట్ర ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో కోరింది. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలు అవస్థలకు గురువుతున్నాయని అపెక్మా రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి విద్యా సాగర్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంతో పాటు గతంలో ఉన్న పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలన్నారు. పెండింగ్ బకాయిలతో కళాశాలల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. జీత భత్యాల చెల్లింపులకు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్యాంకు రుణాలు లభించడం సైతం గగనంగా మారిందన్నారు. ఆర్థిక కష్టాల నుండి గట్టెక్కించాలని కోరారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ కోర్సుల ఫీజులను ఖరారు చేయాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియను త్వరగా మొదలు పెట్టాలని కోరారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి ఆర్థిక సంక్షోభం నుంచి కళాశాలలను గట్టెక్కించాలని కోరారు.

సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న మానవత సంస్థ చైర్మన్ గురుప్రసాద్

మదనపల్లె సిటీ: సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని మానవతా సంస్థ డివిజన్ చైర్మన్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో మానవతా సంస్థ ప్రతినిధుల సమావేశం జరిగింది. వచ్చే నెల పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న సందర్భంగా పలు పాఠశాలలు సందర్శించాలన్నారు. ఆయా పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తామన్నారు. వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి రమణప్ప,రామకృష్ణారెడ్డి, క్రిష్ణప్ప, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ ఆదివారం భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు అమ్మవారికి సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తుల ఆలయ మెట్లకు పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద పలువురు భక్తులు అన్నదానం చేశారు. ఆలయ ఈవో మంజుల భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. రాయలసీమ జిల్లాలతో పాటు కర్ణాటకా, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడం విశేషం.

28న ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శన

రాజంపేట రూరల్ : మేటి కళాకరులచే 28వ తేదీన జీఎంసీలో ఉచిత పౌరాణిక నాటక ఘట్టమును ప్రదర్శిస్తున్నట్లు కళాకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి తెలియజేశారు. స్థానిక జీఎంసీలో కళాకారులతో కలిసి నాటక ప్రదర్శన కరపత్రాలను ఆదివారం జబ్బిరెడ్డి అవిష్కరించారు. అయన మాట్లాడుతూ శ్రీ అన్నమాచార్య, మణికంఠ కళాకారుల ఐక్యవేదిక బృందం సహాయ సహకారాలతో నాటక ఘట్టాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలియజేశారు. రాత్రి 7గంటలకు ప్రారంభమయ్యే ప్రదర్శనలో పాల్గొనేందుకు అందరూ ఆహ్వానితులేనన్నారు. కళాకారులు యు.రామచంద్రారెడ్డి, సుబ్బరాయుడు, ఎం.గంగయ్యనాయుడు, నాగభూషణం, జయరామిరెడ్డి, కృష్ణయ్య, శివారెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

సందడిగా క్రీడామైదానాలు



మైదానంలో హాకీ క్రీడాకారులు



రన్నింగ్ చేస్తున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు

మదనపల్లె సిటీ: వేసవి శిబిరాలతో పాటు మైదానాలు క్రీడాకారులతో ఆదివారం సందడిగా కన్పించించాయి. మదనపల్లె పట్టణం బీటీ కాలేజీ హాకీ మైదానంలో సమ్మర్ హాకీ కోచింగ్ క్యాంప్‌లో భాగంగా క్రీడాకారులు ఉదయం 5 కె రన్ నిర్వహించారు. కదిరిరోడ్డు, నీరుగట్టువారిపల్లె, సొసైటీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రౌండ్‌లో కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, నౌషాద్‌లు డ్రిల్ చేయించారు. పలు ఎక్సర్‌సైజులు నేర్పించారు. అనంతరం ఉమా మహేశ్వరి మెడికల ఏజెన్సీ నిర్వహకులు రవి, సునిల్ క్రీడాకారులకు అల్పాహారం అందించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుట్‌బాల్ క్రీడాకారులతో సందడిగా కన్పించింది. సమ్మర్‌కోచింగ్ క్యాంప్‌లో భాగంగా క్రీడాకారులు ఫుట్‌బాల్ శిక్షణలో పాల్గొన్నారు. బీటీ కాలేజీ మైదానంలో వాలీబాల్ శిక్షణలో భాగంగా ఫుట్‌బాల్ కోచ్ నటరాజ్ శిక్షణ ఇచ్చారు.

భక్తులతో గంగమ్మ ఆలయం కిటకిట



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

లక్కిరెడ్డిపల్లి : రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా వర్షాలు కురిపించి కాపాడు తల్లీ అంటూ ఆదివారం గంగమ్మకు వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మ ఆలయానికి భక్తులు తరలిరావడంతో క్యూలైన్‌లలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారి చిన్నపాటి జాతరను తలపించింది. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాది సంఖ్యలో వచ్చారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.